క్లుప్తంగా...

లాల్‌దర్వాజా ఆలయ కమిటీ చైర్మన్‌గా రాజేందర్‌యాదవ్



రాజేందర్ యాదవ్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహ వాహిని మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్‌గా మాజీ కార్పొరేటర్ సి.రాజేందర్‌యాదవ్ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయంలో ఆదివారం ఫోర్‌మెన్ కమిటీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో కమిటీ సభ్యులు చైర్మన్‌గా రాజేందర్ యాదవ్, కన్వీనర్‌గా గౌని అరవింద్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బి.మారుతీయాదవ్, కోశాధికారిగా పోసాని సదానంద్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. పూర్తిస్థాయి కమిటీని త్వరలోనే ఎన్నుకుంటామన్నారు. నూతన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫోర్‌మెన్ కమిటీ చైర్మన్‌లు శివకుమార్‌యాదవ్, పోసాని సురేందర్ ముదిరాజ్, శీర రాజ్‌కుమార్, బద్రీనాథ్‌గౌడ్, సలహాదారులు కాశీనాథ్‌గౌడ్, మాజీ చైర్మన్ మాణిక్ ప్రభుగౌడ్ పాల్గొన్నారు.

మొదలైన మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మధుసూదన్‌గౌడ్ తదితరులు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మల్టీ పర్పస్ కల్యాణ మండపం నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం రాజనర్సింహాచార్యులు, పవన్‌కుమార్ ఆచార్యుల పర్యవేక్షణలో గణపతి పూజ, పుణ్యావాచకం, వాస్తు హోమం, ఈశాన్య స్తంభ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జనగామ మధుసూదన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కీర్తి నరేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పతాకావిష్కరణకు ఏర్పాట్లు

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను గోల్కొండ కోటలో బీజేపీ ఆధ్వర్యంలో జరగనున్నాయని బీజేపీ నాయకులు టి.అమర్ సింగ్, దేవర శ్రీనివాస్ అన్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఈనెల 2న గోల్కొండ కోటలో పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం వారు కేంద్రపురావస్తు శాఖ హైదరాబాద్ రీజియన్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ స్మితా కుమార్‌తో గోల్కొండ కోటలో పతాకావిష్కరణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్మితా కుమార్ మాట్లాడుతూ..... పతాకావిష్కరణ వేడుకల పరిసరాల్లో భద్రత ఏర్పాట్లు చూసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ కోట సీనియర్ పరిరక్షణ అధికారి నవీన్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కార్యాలయ అధికారి సంపత్ తదితరులున్నారు.

అన్ని డివిజన్లకు సమ ప్రాధాన్యం



న్యూ సత్యనారాయణనగర్‌లో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ సెక్యులర్ పార్టీ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంలో ఎటువంటి వివక్ష ఉండదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన న్యూ సత్యనారాయణ నగర్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ టీవీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో అన్ని డివిజన్లకు సమ ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేయిస్తున్నానన్నారు. న్యూ సత్యనారాయణ నగర్ వాసులు ఐక్యంగా ఉండి కాలనీలను అభివృద్ధి చేసుకోవడం అభినందించదగ్గ విషయమని ఆయన అన్నారు. కాలనీలో నేరాల నియంత్రణకు శాంతి భద్రతలను కాపాడటానికి సీసీ టీవీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. మరోవైపు నియోజకవర్గంలో కార్వాన్ నియోజకవర్గానికి అధునాతన డ్రైనేజీ ఏర్పాటుకు సుమారు రూ.300 కోట్లు మంజూరు అయ్యాయని, న్యూ సత్యనారాయణనగర్‌లో కూడా కొత్త డ్రైనేజీ వేయించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, బీజేపీ నాయకులు దేవర వంశీ, పవన్ సింగ్ లోథ్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులున్నారు.



రాయదుర్గంలోని ఐరన్ విద్యుత్ స్తంభాలు

క్షణ..క్షణం.. భయం..భయం..

ప్రమాదకరంగా పురాతన విద్యుత్ స్తంభాలు

- తుప్పపట్టిపోతున్నా పట్టించుకోని అధికారులు
- వర్షాకాలంలో ఏటా ప్రమాదాలు
- సబ్‌స్టేషన్‌ను షేక్‌పేట్ నుంచి గచ్చిబౌలిలోకి మార్చాలని డిమాండ్
- రాయదుర్గంలోనే ప్రత్యేక సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి
- ఇదీ రాయదుర్గంలోని విద్యుత్ సమస్యల పరిస్థితి'

రాయదుర్గం: హైటెక్ ప్రాంతంగా గుర్తింపు పొందిన శేరిలింగంపల్లిలో భాగమైన రాయదుర్గం పరిధిలో ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాల కారణంగా ప్రజలు ప్రతి రోజూ భయం..భయంగా కాలం గడుపుతున్నారు. విద్యుత్ సరఫరా, నిర్వహణ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉండటంతో పట్టించుకునేవారు కరువయ్యారు. కేవలం రాయదుర్గం ప్రాంతాన్ని మాత్రమే షేక్‌పేట్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ కిందకు వదిలేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం పట్ల అధికారులు వివక్ష చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను షేక్‌పేట్ నుంచి గచ్చిబౌలి పరిధిలోకి మార్చాలనే ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. లేని పక్షంలో రాయదుర్గంలోనే ప్రత్యేకంగా సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఐరన్ స్తంభాలతో అవస్థలు..

- రాయదుర్గంలో ప్రాంతంలో ఇప్పటికీ పురాతన ఐరన్ విద్యుత్ స్తంభాల కారణంగా ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.
- వాటిలో చాలా వరకు తప్పు పట్టి పోవడంతో ఎప్పుడు కూలిపోతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- కొన్ని స్తంభాలకు స్థానికులే ప్లాస్టిక్ కవర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.
- సమస్యను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



- వర్షాకాలంలో ఎవరైనా పట్టుకుంటే షాక్ కొడుతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ఐరన్ స్తంభాల స్థానంలో కొత్తగా సిమెంట్ పోల్స్ ఏర్పాటు చేయాలని కోరినా ఫలితం శూన్యం.
- విద్యుత్ సమస్యల తలెత్తినా అధికారులు స్పందించడం లేదని ఆయా ప్రాంతాలవాసులు వాపోతున్నారు.
- షేక్‌పేట్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి రాయదుర్గం ప్రాంతాన్ని గచ్చిబౌలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోకి మార్చాలని కోరుతున్నారు.
- రాయదుర్గంలో ప్రత్యేకంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు
- రాయదుర్గంలోని ప్రభుత్వ భూముల విక్రయం ద్వారా రూ. కోట్లల్లో ఆదాయం పొందుతున్న ప్రభుత్వం విద్యుత్ సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

“ సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలి



రాయదుర్గంలో ప్రస్తుత ఐరన్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలి. స్థానిక బస్తీలు, గల్లీల్లో విద్యుత్ స్తంభాల కారణంగా వర్షాకాలంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేవారు కరువయ్యారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలి. – నిఖిల్‌యాదవ్, రాయదుర్గం

షేక్‌పేట్ నుంచి గచ్చిబౌలికి మార్చాలి



శేరిలింగంపల్లి పరిధిలోని రాయదుర్గం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉంది. దీంతో సంబంధిత అధికారులు ఈ ప్రాంతం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాయదుర్గంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి శేరిలింగంపల్లి విద్యుత్ విభాగం పరిధిలోకి మారిస్తే సమస్య లు పరిష్కామవుతాయి. లేని పక్షంలో గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలోకి మార్చేలా చర్యలు తీసుకోవాలి. – దారుగుపల్లి నరేష్, రాయదుర్గం

ఎన్టీఆర్ శాశ్వతంగా గుర్తుంటారు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



చిత్రపురి కాలనీలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

మణికొండ: సినిమా, రాజకీయ రంగాల్లో రాణించి ఎంతో మందికి మార్గదర్శిగా నిలబడిన వ్యక్తి ఎన్టీఆర్ అని ఆయన ప్రజలకు శాశ్వతంగా గుర్తుంటారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో ఆదివారం ఆయన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని చిత్ర కార్మికులు ఉండే కాలనీలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పటం ఎంతో శుభ పరిణామన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. రాజకీయంగా ఎందరో అనామకులను ఎమ్మెల్యేలను చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు.

త్వరలో కొత్త ఇళ్లు నిర్మిస్తాం..

చిత్రపురి కాలనీలో త్వరలోనే మరిన్ని కొత్త గృహాలను నిర్మించి ఇప్పటి వరకు గృహాలు రాని వారికి న్యాయం చేస్తామని చిత్రపురి హౌసింగ్‌సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ అన్నారు. రచయిత పరుచూరి వెంకటేశ్వర్‌రావు, అట్లూరి నాగేశ్వర్‌రావును సన్మానించారు. సినీనటులు మురళీమోహన్ రావు, నిర్మాత కల్యాణ్, కౌన్సిలర్ హైమాంజలి అనిల్‌కుమార్, హౌసింగ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మంచి కథకుడు ముదిగొండ



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: సమకాలీన సమస్యలకు పరిష్కారాల్ని సూచించే మంచి కథకుడు ముదిగొండ అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. చింతన సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన 'సాహిత్యా కళా తాత్త్వికమూర్తిమత్వం ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య సాహితీ వ్యక్తిత్వం' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. హెచ్‌సీయూ నుంచి ఆన్‌లైన్‌లో ఆయన మాట్లాడుతూ ముదిగొండ వీరభద్రయ్య సెంట్రల్ యూనివర్శిటీ అధ్యాపకులుగా సుదీర్ఘకాలంపాటు పనిచేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌లో గౌరవ ఆచార్యులుగా పనిచేశారన్నారు. జీవితంలో అసహనానికి, అశాంతికి, ఒంటరితనానికి కారణాలు తెలియాలంటే ఆయన కథలు చదవాలన్నారు, జీవితాలను సరిదిద్దుకునేందుకు ఈ కథలు దోహదపడతాయన్నారు. నైతికతకు, జీవితంలో అనివార్యమైన సామాజిక సర్దుబాట్లకు మధ్య గల వ్యత్యాసాల్ని తెలియజేస్తూనే, ఉత్తమ మూర్తిమత్వాన్ని పెంపొందించే కథలుగా వ్యాఖ్యానించారు. సమాజ గౌరవ మర్యాదలు పొందడమెంత ముఖ్యమో, అవి మనిషి అంతరంగ సంఘర్షణకు గురికాకుండా కాపాడాలనీ, అలా కాపాడుకోవాలంటే మనిషి తనలో తాను చూసుకోగలిగినప్పుడే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం



గోపీనగర్‌లో పర్యటిస్తున్న గజ్జెల యోగానంద్

శేరిలింగంపల్లి: తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు గజ్జెల యోగానంద్ అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శనివారం రాత్రి శేరిలింగంపల్లి గోపీనగర్‌లో కొనసాగింది. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ అబద్ధపు హామీలను ప్రజలు విశ్వసించరన్నారు. బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. శేరిలింగంపల్లి నుంచి అధిక ఆదాయ వనరులు ఉన్నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజు శెట్టి, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సత్య కురుమ, బాలరాజ్, శ్రీకాంత్, దయాకర్, శివకుమార్, శ్రీనివాస్‌చారీ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మజ్లిస్ నాయకుడి మృతి

గోల్కొండ: అహ్మద్‌నగర్ కాలనీ మజ్లిస్ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఖాలెద్ (37) మృతి చెందారు. ఈయన మృతిపై పలువురు వివిధ రకాలుగా చూస్తున్నారు. బాగ్దాద్ కాలనీ నాలాను ఆనుకుని ఉన్న ఇంటి ముందు గుండె పోటుతో ఆయన మృతి చెందారని పలువురు అంటున్నారు. అయితే ఇంటి ముందు ఉన్న నాలాకు ఉన్న ఇనుప ఫెన్సింగ్‌కు అనుకోకుండా చేయి తగిలినందు వల్లే ఆయన విద్యుదాఘాతంతో మృతిచెందారని మరికొందరు అంటున్నారు. నాలాకు ఉన్న ఎత్తైన ఇనుప ఫెన్సింగ్ విద్యుత్ తీగలు తగిలి నాలా ఫెన్సింగ్‌లో సైతం విద్యుత్ ప్రవహించిందని, అనుకోకుండా మృతుడు ఖాలెద్ ఫెన్సింగ్‌ను పట్టుకోవడం వల్లే విద్యుదాఘాతానికి మృతి చెందారని మరికొందరు అంటున్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మృతదేహాన్ని సందర్శించి ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు.

మధ్యవర్తిత్వంతోనే సమస్యల పరిష్కారం



సమావేశమైన డైమండ్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్

గచ్చిబౌలి: మధ్యవర్తిత్వం ద్వారానే ప్లాట్ల సమస్యలు పరిష్కారమవుతాయని డైమండ్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్ అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్లాట్ల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు సందర్భాల్లో సుప్రీంకోర్టు సివిల్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచిందన్నారు. ఈ క్రమంలోనే మై హోం గ్రూప్‌ను సంప్రదించి మధ్యవర్తిత్వం జరపాలని కోరినట్లు ప్లాట్ ఓనర్స్ తెలిపారు. ఇప్పటికే మై హోంకు ఎల్‌ఓఐ(లెటర్ ఆఫ్ ఇంటెంట్) ఇవ్వడం జరిగిందన్నారు. ప్లాట్ల సమస్యల కారణంగా మధ్య తరగతి వారు అమ్ముకోలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో డైమండ్‌హిల్స్ ప్లాట్ ఓనర్స్ డాక్టర్ పి.సుబ్బారెడ్డి, కళ్యాణ్ చక్రవర్తి, ఉమామహేశ్వర్ రెడ్డి, రాజేందర్, ప్రవీణ్, ప్రభాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జన్ దేవ్ జీ మహరాజ్‌కి నివాళి

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడలోని సిక్ చావునీ గురుద్వారలో ఆదివారం శ్రీ గురు అర్జన్ దేవ్ జీ మహరాజ్ 417వ సంస్మరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సిక్ సోదరులు ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ లలితాబాగ్ డివిజన్ అధ్యక్షుడు జమ్మిచెట్టు రాజు, హర్దీప్ సింగ్, ఖతర్ సింగ్, చోటూ సింగ్, మన్మోహన్ సింగ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో అవినీతి పాలన

బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి. అమర్‌సింగ్

గోల్కొండ: తెలంగాణలో అవినీతి పాలన సాగుతుందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి. అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ గోల్కొండ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడిస్తారన్నారు. స్వయంగా బీఆర్‌ఎస్ పార్టీ మంత్రులే అవినీతిలో కూరుకుపోయారని ఆయన అన్నారు. అవినీతి రహితంగా పాలించడం ఒక బీజేపీకే సాధ్యమని ఆయన అన్నారు. తెలంగాణలో బీజేపీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని, బీజేపీ నిర్వహించిన ప్రజా సంగ్రామ యాత్రలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

మన్‌కీబాత్ 101వ ఎపిసోడ్‌ను వీక్షించిన బీజేపీ నేతలు



హైదర్‌గూడలో మన్ కీ బాత్ వీక్షిస్తున్న సాబాద విజయ్‌కుమార్ తదితరులు

రాజేంద్రనగర్: భారత ప్రదాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం 101వ ఎపిసోడ్‌ను ఆదివారం అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్ నివాసంలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని శుద్ధి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ధన్యవాదాలు తెలపడం అభినందనీయమన్నారు. చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కాడెం సుధాకర్, కాకుళారం కృష్ణ, సాయియాదవ్, సోమనాథ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, సాబాద స్వప్న, కృత్తిక పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో..

బీజేపీ అధికార ప్రతినిధి శక్తి కేంద్రం ఇన్‌చార్జీ రాచూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో అత్తాపూర్ డివిజన్‌లోని లాలా లజపతిరాయ్ శక్తి కేంద్రం తేజస్వీనగర్‌లో నరేంద్రమోదీ 101వ భాగం మన్ కీ బాత్ కార్యక్రమం బూత్ 6 కార్యక్రమాల ప్రముఖ్ హనుమాన్‌దాస్ అగర్వల్ నివాసంలో వీక్షించారు. ఈ సందర్భంగా రాచూరి రాజశేఖర్ మాట్లాడుతూ.. దేశం గర్వించే దినం ప్రపంచంలోని అగ్ర దేశాలు కూడా భారత దేశాన్ని చూస్తున్నాయన్నారు. బూత్ అధ్యక్షుడు సంతోష్, కొలేకర్, అంకూర్, బన్సల్, రామమూర్తి, రందీర్‌సింగ్, యాదయ్య, హనుమాన్ దాస్ అగర్వాల్, రఘునందన్, సాయి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ల బృందం

బండ్లగూడ: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, ఈఎస్‌ఐ ఆస్పత్రి హెచ్‌ఓడీ డాక్టర్ రమేష్ అన్నారు. శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి దివ్య ఆశీస్సులతో ధ్యాన మనో ప్రస్థానం, సైన్స్ యూనివర్స్ బండ్లగూడ ఆధ్వర్యంలో ఆదివారం 400వ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాలు 2006 నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి నిరాటకంగా నిర్వహిస్తున్నారన్నారు. 18 ఏళ్ల నుంచి సుమారు 2 లక్షల మందికిపైగా నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు, మెడిసిన్స్ అందించడంతో పాటు ల్యాబ్ టెస్టులు, ఫిజియోథెరపి చేసినట్లు వివరించారు. వైద్య శిబిరాలను కొన్ని సంవత్సరాలుగా నిరంతరం ఉచిత వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఎస్.రాజ్‌కుమార్, డాక్టర్ పి.వీనా, డాక్టర్ ఎస్.తరుణ్, డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ పి.మరియదాస్, డాక్టర్ వర్షలను వారు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ యూనివర్స్ ప్రతినిధులు బి.రాందాస్, డాక్టర్ ఎస్. రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నియామకం



అబ్దుల్ సిలార్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జీగా అబ్దుల్ సిలార్ నియమితులయ్యారు. కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్ ఆదేశాలనుసారం ఆర్‌టీఐ పీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకటేష్‌ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ చేతులమీదుగా అబ్దుల్ సిలార్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ అసెంబ్లీలో అన్ని కమిటీలు వేసి యువకులను చట్టాల పరంగా అవగాహన కలిగి ఉండేలా, వాళ్లల్లో చైతన్యం కలిగించి, ప్రశ్నించే వ్యక్తులుగా తయారు చేసి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అవినీతిని నిర్మూలించడమే సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ పని చేస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రాజేంద్రనగర్: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆరాంఘర్ నుంచి అత్తాపూర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో పీవీ నర్సింహా రావు ఎక్స్‌ప్రెస్‌వే 280 పిల్లర్ వద్ద రోడ్డు దాటుతున్న మహిళలను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలకు గురైన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన వెంటనే వాహనాదారుడు తన వాహనాన్ని ఆపకుండా అలాగే వెళ్లిపోయాడు. మహిళకు సంబంధించిన వివరాలు లభించకపోవడంతో గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి సంబంధించిన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే రాజేంద్రనగర్ పోలీసులను గానీ ఉస్మానియా మార్చురీ సిబ్బందిని గానీ సంప్రదించాలని పోలీసులు కోరారు.

జూన్ 4న సీపీఐ ప్రజాగర్జన



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న పుస్తకాల నర్సింగ్‌రావు తదితరులు

మణికొండ: జూన్ 4న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా సీపీఐ పార్టీ కొత్తగూడెంలో ప్రజాగర్జన బహిరంగ సభను నిర్వహిస్తుందని దాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, అభిమానులు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు పుస్తకాల నర్సింగ్‌రావు అన్నారు. ఆదివారం ఆయన ప్రజా గర్జన వాల్ పోస్టర్‌ను నార్సింగిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ప్రైవేటీకరణ, బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, ఐఐఎం, ఐటీఐ లాంటి ఉన్నత విద్యా సంస్థలను ఏర్పాటు చేయటంతో పాటు కేంద్ర ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పది లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. అవే డిమాండ్లతో ప్రజాగర్జన నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మల్లేష్, ఉపాధ్యక్షులు శంకరయ్య, సీపీఐ మండల కార్యదర్శి బాబురావు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

మట్టి కుప్పలు తొలగించండి



మణికొండ గార్డెన్స్ కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న మహిళలు

మణికొండ: ఓ అభివృద్ధి పనిని సకాలంలో చేస్తే అక్కడి వారు సంతోషిస్తారు. అదే పనిని నెలల తరబడి చేస్తూ ప్రజల రాకపోకలకు సైతం వారికి ఇబ్బంది కలిగిస్తే మున్సిపాలిటీ పాలకులతో పాటు అధికారులను తిట్టుకుంటారు. అదే పరిస్థితి మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ గార్డెన్స్ కాలనీలో నెలకొంది. పై కాలనీల నుంచి వచ్చే వరద నీటిని అండర్‌గ్రౌండ్ ద్వారా బయటకు పంపాలనే ఉద్దేశంతో ఇటీవల పెద్ద సైజు పైపులను వేసే పనులను ప్రారంభించారు. అవి నెల రోజులు దాటినా పూర్తి కాకపోవటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేపట్టిన పనులు సైతం లోప భూయిష్టంగా, అధికారుల పర్యవేక్షణ లేకుండా చేపట్టారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ పైపులను ఒకదానిలో ఒకటి చేర్చి మట్టి వేశారని, జాయింటింగ్ సరిగా చేయకపోవటంతో మురుగు, వరద నీరు లీకేజీలు అవుతున్నాయని పేర్కొన్నారు. దీంతో భూగర్భ జలాలు కలుషితం అయి అవే నీటిని వాడుకోవటం వల్ల ప్రజలు అనారోగ్యాల పాలయ్యే పరిస్థితి ఉందని కాలనీవాసులు తెలిపారు. పైప్‌లైన్ పనులు పూర్తయినా రోడ్లపై ఉన్న మట్టిని తొలగించకపోవటంతో నెలల తరబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మున్సిపాలిటీ వారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లపై మట్టిని తొలగించి ప్రజల రాకపోకలను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

యువతకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి వార్డు కార్యాలయంలో యువకులకు కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆదివారం స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించేందుకు యువత కష్టపడాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. లింగంపల్లి విలేజ్, సురభీకాలనీ, గోపీనగర్, నెహ్రూనగర్ యువకులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో లింగంపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ అధ్యక్షులు గద్దం రవియాదవ్, వెంకట్‌రెడ్డి, రాజుయాదవ్, కిరణ్, గఫర్, మహేందర్ సింగ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు